# భ్రూణహత్యలు

**Rahme Mader Mein Bachchon Ka Qatl**
**(Telugu)**

# భ్రూణ హత్యలు


రచన
డాక్టర్ ముహమ్మద్ రజివుల్ ఇస్లాం నద్వీ

తెలుగు అనువాదం
అబుల్ ఇర్ఫాన్



TRUST

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Bhruna Hatyalu**
**Rahme Mader Mein Bachchon Ka Qatl (Telugu)**

**TIP Series No.** : **151**

Written by : Dr. Mohammad Raziul Islam Nadvi
Translated by : Abul Irfan

All Rights Reserved with Publishers

3rd Edition : August 2021

Copies : 1000

**Price** : **Rs. 25**

ISBN : 81-88241-46-6

Published by : Telugu Islamic Publications Trust
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| శిశుహత్యలు | ...... | 05 |
| మానవసంతతి పరంపర - ప్రకృతి వ్యవస్థ | ...... | 06 |
| ప్రకృతి వ్యవస్థలో మానవ జోక్యం | ...... | 08 |
| ఇతర దేశాల పరిస్థితులు కూడా ఇంతకంటే మెరుగ్గా లేవు | ...... | 09 |
| సమాజంలో బాలికల పట్ల చిన్నచూపు | ...... | 10 |
| ఖుర్ఆన్ అవతరణ కాలంలో పరిస్థితి | ...... | 11 |
| బాలికల సజీవసమాధి-మూఢాచారం | ...... | 13 |
| ఆధునిక అజ్ఞానం | ...... | 14 |
| ప్రస్తుత చట్టాల అసహాయత | ...... | 15 |
| ఇస్లామీయ నివారణ ప్రయత్నాలు | ...... | 16 |
| మానసిక శిక్షణ | ...... | 17 |
| దారిద్ర్య భయం | ...... | 18 |
| బాలికల సజీవసమాధిపై నిషేధం | ...... | 19 |
| పరలోకంలో యమయాతనలు తప్పవు | ...... | 19 |
| శిశుహత్య నివారణకై ప్రవక్త (స) ప్రమాణం చేయించడం | ...... | 20 |
| బాలికల పోషణ, సంరక్షణకు స్వర్గశుభవార్త | ...... | 21 |
| బాలికల విద్యాశిక్షణల ఔన్నత్యం | ...... | 23 |

# ముందుమాట

ఈనాటి అతిసున్నితమైన జటిల సమస్యల్లో భ్రూణహత్యల సమస్య కూడా చేరిపోయింది. ఈ సమస్య ఒక్క మన దేశాన్నే కాకుండా యావత్తు ప్రపంచాన్ని పట్టి పీడిస్తోంది. తత్కారణంగా స్త్రీ పురుష జాతుల సంఖ్యలో సమతౌల్యం నానాటికి దిగ జారిపోతోంది. బాలుర సంఖ్య పెరిగిపోతుంటే, బాలికల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది. దీనివల్ల భవిష్యత్ సమాజం ఎలాంటి భయంకర పరిణామాలకు గురయిపోతుందోనని భావిస్తూ సంఘసంస్కర్తలు తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతున్నారు. ప్రభుత్వ స్థాయిలో కూడా ఈ చెడును అరికట్టే విషయం గురించి కృషి జరుగుతోంది. కఠినమైన చట్టాలు చేసి, ఇలాంటి నేరాలకు పాల్పడేవారికి శిక్షలు కూడా విధించడం జరుగుతోంది. అయినప్పటికీ ఈ రుగ్మత అంతమయ్యే సూచనలు కన్పించడం లేదు.

ఇస్లాం వచ్చిన ప్రారంభకాలంలో కూడా ఈ రుగ్మత ఓ ప్రత్యేక రూపంలో కొనసాగుతుండేది. ప్రజలు బాలికలను పుట్టగానే సజీవసమాధి చేస్తుండేవారు. ఇస్లాం ఈ దురాచారాన్ని ఖండిస్తూ దీన్ని మానుకోవాలని ప్రజలకు ఉపదేశించింది. వారిని మానసికంగా దానికి వ్యతిరేకంగా తయారుచేసింది. చివరికి కొద్ది కాలంలోనే ఈ సామాజిక రుగ్మత పూర్తిగా అంతమైపోయింది.

ఈ సామాజిక రుగ్మతను అంతమొందించ గోరుతున్నవారు దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడుపుతున్నారు. లేదా చట్టం ద్వారా దాన్ని అరికట్టడం జరుగుతుందని ఆశిస్తున్నారు. అలాంటివారు ఇస్లాం బోధనలు అధ్యయనం చేయాలి. ఇస్లాం ఈ సామాజిక రుగ్మతను పూర్తిగా అంతమొందించడంలో ఏ విధంగా విజయవంతమైందో తెలుసుకోవడానికి ప్రయత్నించాలి.

అలీగఢ్,
ఉత్తరప్రదేశ్

ఇదారా తహ్‌ఖీఖ్ వ తస్నీఫ్ ఇస్లామి
ముహమ్మద్ రజివుల్ ఇస్లాం నద్వీ

అనంత కరుణామయుడు అపారకృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

# శిశుహత్యలు

మన దేశంతో పాటు యావత్తు ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఆధునిక కాలపు సామాజిక సమస్యల్లో భ్రూణహత్యల సమస్య కూడా ఉంది. నేడు బాలికల ఉనికి తీసుకువస్తున్న అనేక సమస్యలకు ప్రజలు భయపడి పోయి బాలికలు అసలు పుట్టకుండా చేయడానికి రకరకాల పాట్లు పడు తున్నారు. వీటికి వైజ్ఞానిక ప్రగతి, సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతోంది. అత్యాధునిక పరికరాల ద్వారా మాతృగర్భంలోనే లైంగిక జన్యువులు కను గొనడం జరుగుతోంది. ఈ లింగనిర్ధారణ పరీక్షల ద్వారా గర్భస్థపిండం ఆడ శిశువుకు సంబంధించినదని తెలియగానే దాన్ని మాతృగర్భంలోనే నిర్దాక్షిణ్యంగా మట్టుపెడ్తున్నారు. ఈ ప్రక్రియ వల్ల తల్లి జీవితానికి ఎలాంటి ప్రమాదం ఎదురైనా సరే దాన్ని ఏమాత్రం ఖాతరు చేయడం లేదు.

ఈ పరిస్థితుల పట్ల సంఘసంస్కర్తలు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. కాని ఈ రుగ్మతను అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో వారికి అర్థం కావడం లేదు. ప్రభుత్వ స్థాయిలో అనేక చట్టాలు చేయబడ్డాయి. ఈ చట్టాలలో భ్రూణహత్యలకు పాల్పడేవారికి, వారితో సహకరించేవారికి కఠినమైన శిక్షలు ప్రతిపాదించబడ్డాయి. ఆ శిక్షలను అమలు పరచడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా కూడా ఉంటుంది. కాని దాని ప్రయత్నాలు ఫలవంతమయ్యే సూచనలు కానరావడం లేదు. ఈ రుగ్మత కేన్సర్ వ్యాధిలా సమాజంలో వ్యాపించిపోతూ, మందు వాడుతున్న కొద్దీ రోగం ముదిరి పోతున్నట్లు. మన సంస్కృతీ వ్యవస్థను లోలోన తొలచి వేస్తోంది.

ఇలాంటి పరిస్థితుల్లో ఇస్లాం ముందుకొచ్చి ఈ సామాజిక రుగ్మతను అరికట్టడానికి మనకు చక్కని మార్గదర్శనం చేస్తోంది. ఇస్లాం పరిస్థితిని

లోతుగా విశ్లేషిస్తూ దానికి అసలు కారణాలను వెలుగులోకి తీసుకొస్తుంది. వాటి దుష్ఫలితాలను గురించి హెచ్చరిస్తుంది. వాటి నివారణ చర్యలను గురించి తెలియజేస్తుంది. విశేషమేమిటంటే ఈ చర్యలను అవలంబించడం ద్వారా గత కాలంలో ఒకసారి ఈ సామాజిక రుగ్మతను పూర్తిగా అంత మొందించడం జరిగింది. కాబట్టి ఈ రుగ్మతను మనస్ఫూర్తిగా అంత మొందించదలచు కున్నవారు ఇస్లాం చూపిన చికిత్సా విధానం ఏమిటో తెలుసుకొని, దాన్ని అమలు పరచడానికి కృషి చేయాలి.

## మానవసంతతి పరంపర - ప్రకృతి వ్యవస్థ

ఈ ప్రపంచంలోని రంగు, వాసన, చలనం, స్పందనలు మానవ ప్రాణం కారణంగానే సాగుతున్నాయి. విశ్వవనంలో మానవ ప్రాణమే అన్నిటి కంటే అతి శ్రేష్ఠమైన పుష్పం. దేవుడు ప్రపంచంలోని ప్రతి వస్తువునీ మానవుని ఉపయోగార్థమే సృష్టించాడు. మానవ సంతతి పరంపర, మనుగడ, పరిరక్షణల కోసం దేవుడు "దాంపత్య చట్టాన్ని" ప్రవేశపెట్టాడు. ఆయన మాన వుల్నే కాదు, జంతువుల్ని, పక్షుల్ని, వృక్షాలను కూడా జంటలు జంటలుగా రూపొందించాడు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

> **"అన్ని రకాల జంటలను సృష్టించిన ఆయన పరిశుద్ధుడు. అవి భూమిలో నుండి పుట్టే వృక్షరాశులలోనైనా సరే లేదా స్వయంగా వారి జాతి (అంటే మానవులు) లో నుండి అయినా సరే లేదా వారు అసలే ఎరుగని వస్తువులలో నుండి అయినా సరే."**
>
> *(ఖుర్‌ఆన్-36:36)*

> **"ఆకాశాలకూ, భూమికీ సృష్టికర్త అయిన ఆయన, స్వయంగా మీ జాతినుండే మీ కొరకు జంటలను సృష్టించాడు; ఇదే విధంగా పశువులలో కూడా (వాటి జాతి) జంటలను సృష్టించాడు. ఈ విధంగా ఆయన మీ సంతతులను వ్యాపింపజేస్తాడు."**
>
> *(ఖుర్‌ఆన్-42:11)*

మానవ జంట అయిన స్త్రీ పురుషుల కలయికతో కుటుంబ ఏకాంతం ఉనికిలోకి వస్తుంది. కుటుంబంలో కొడుకులు, కూతుళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళు, ఇతర సంబంధీకులు ఉంటారు. ఈవిధంగా మానవ సంతతి పరంపర సాగుతూ జనాభా పెరుగుతూ ఉంటుంది. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

**"అల్లాహ్‌యే మీ కోసం మీ జాతి నుండే భార్యలను చేశాడు. ఆయనే ఆ భార్యల ద్వారా మీకు కుమారులను, మనుమలను ప్రసాదించాడు."** *(ఖుర్‌ఆన్-16:72)*

**"ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంటద్వారా ఎంతో మంది పురుషులను, స్త్రీలను అవనిలో వ్యాపింపజేశాడు."** *(ఖుర్‌ఆన్-4:1)*

సృష్టికర్త మానవ సంతతి పరంపర, అందులో స్త్రీ పురుషుల సమ తౌల్యం విషయంలో ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పరచాడు. దీని వెనుక అద్భుత మైన సృష్టిచాతుర్యం ఉంది. ఆయన తాను తలచిన విధంగా కొందరికి కేవలం బాలికలు, కొందరికి కేవలం బాలురు, మరికొందరికి బాలికలు, బాలురు కూడా ప్రసాదిస్తాడు. అంతేకాదు ఆయన తలచుకుంటే కొందరికి అసలు సంతానమే లేకుండా చేస్తాడు. ఏమైనప్పటికీ ఆడ-మగ జాతుల మధ్య సమతౌల్యం మాత్రం ఉంటుంది. మానవ చరిత్రలో ఎన్నడూ, ఏ భూభాగంలో కూడా కేవలం బాలురు పుట్టి బాలికల జనాభా తగ్గిపోయినట్లుగాని లేదా కేవలం బాలికలు పుట్టి బాలుర జనాభా తగ్గిపోయినట్లుగాని సంభవించ లేదు. ఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు గమనించండి:

**"భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అల్లాహ్ ప్రభువు; ఆయన తాను కోరిన దానిని సృష్టిస్తాడు; తనకు ఇష్టమయిన వారికి కూతుళ్ళను, తాను కోరిన వారికి కొడుకులను ఇస్తాడు; తనకు**

**ఇష్టమైన వారికి కొడుకులను, కూతుళ్ళనూ కలిపి ఇస్తాడు. తాను కోరిన వారికి అసలు సంతానమే ఇవ్వడు. ఆయనకు అంతా తెలుసు. ఆయనకు అన్నింటిపైనా అధికారం ఉంది."**

*(ఖుర్ఆన్-42:49.50)*

# ప్రకృతి వ్యవస్థలో మానవ జోక్యం

సృష్టికర్త విశ్వవ్యవస్థను పటిష్ఠమైన ప్రకృతి శాసనాలు, నిత్యసత్యాల ఆధారంగా రూపొందించాడు. మానవుడు ఈ దైవిక చట్టాలను ఉల్లంఘించి నప్పుడల్లా ప్రపంచంలో అల్లకల్లోలం, అరాచకాలే చెలరేగాయి.

**"మానవులు చేజేతులారా సంపాదించుకున్న దాని ఫలితంగానే నేలపైనా, నీటిలోనూ కల్లోలం చెలరేగింది."** *(ఖుర్ఆన్-30:41)*

మానవ సృష్టి విషయమయి సృష్టికర్త జారీ చేసిన ప్రకృతి వ్యవస్థలో మానవ జోక్యం కారణంగా ఏర్పడే అరాచకం, అల్లకల్లోలం, సమతూలనా రాహిత్యాలు నేడు మనం కళ్ళారా చూస్తున్నాము. మానవ సమాజం వాటి చేదు ఫలితాలు కూడా అనుభవిస్తోంది. కొన్నేళ్ళ క్రితం జనాభా పెరుగుదలను ఓ పెనుభూతంగా చిత్రించి వ్యాపింపజేయడం జరిగింది. దీని పరిష్కారం కోసం కుటుంబనియంత్రణ (Family planning) పథకాలు రూపొందించ బడ్డాయి. సంతాన నియంత్రణ (Birth Control) చట్టాలు చేయబడ్డాయి. వ్యవహారం మరింత ముందుకు పోయి 'లింగనిర్ధారణ' (Sex Determination) ప్రయత్నా లకు తలుపు తెరచింది. వివిధ సాధనాల ద్వారా మాతృ గర్భంలో పెరుగుతున్న పిండం ఆడా లేక మగా అనే విషయాన్ని ధృవపరచు కోవడం జరుగుతోంది. ఈ లింగనిర్ధారణ పరీక్షలో పెరుగుతున్న పిండం బాలికదని తెలియగానే ప్రజలు గర్భవిచ్ఛేదం (Abortion) ద్వారా 'పీడా' వదిలించుకుంటున్నారు. ఈ విధంగా దాన్ని జీవించే హక్కు లేకుండా శాశ్వతంగా కడతేరుస్తున్నారు.

ఈ రుగ్మత ఏదో ఒక భూభాగంలోనే కాదు, యావత్తు ప్రపంచంలో వ్యాపించిపోయింది. అందువల్లనే ప్రపంచ స్థాయిలో సమాజ శ్రేయోభి లాషులు దీనిపట్ల తీవ్ర ఆందోళన వెలిబుచ్చుతూ దీని నివారణోపాయాలను గురించి ఆలోచిస్తున్నారు.

ఇప్పుడు ప్రపంచంలోని మొత్తం జనాభాలో 100 మంది బాలురకు 103 నుంచి 107 మంది బాలికలు ఉన్నారు. అక్టోబర్, 2005లో ఫ్రాన్స్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోగ్రాఫిక్ స్టడీస్ ఆధ్వర్యాన చైనాలో ఒక సర్వే జరిగింది. దాని నివేదిక ప్రకారం చైనాలో 100 మంది బాలురకు 133 బాలికలు ఉన్నట్లు తెలిసింది. చైనాలో బాలురు, బాలికల మధ్య ఈ వ్యత్యాసం గనక ఇలాగే కొనసాగితే 2015-2030 సంవత్సరాల మధ్య కాలంలో రెండున్నర కోట్ల మంది యువకులకు పెళ్ళిళ్ళు అయ్యే ఆశ ఉండదని కూడా సర్వే రిపోర్టులో ఆందోళన వ్యక్తమయింది. సన్‌హోర్ వార్తా సంస్థ ప్రకారం 2003లో చైనాలోని 24 పరగణాలలో జాతీయ జనాభా, కుటుంబ నియంత్రణ కమిషన్‌ల ద్వారా బాలికల జనాభాను పెంచడానికి ఒక ముఖ్యమైె కార్యక్రమం ప్రారంభించ బడింది. దీని ప్రకారం బాలికలు మాత్రమే ఉండే కుటుంబాలకు నగదు బహుమతి అందజేయడంతో పాటు అనేక సామాజిక ప్రయోజనాలు చేకూర్చే ఏర్పాటు కూడా ఉంది. గత మూడేళ్ళలో ఈ కార్యక్రమం ద్వారా పైపరగణాలలో బాలురు, బాలికల 100:133.8 నిష్పత్తిని 100:119.6కు తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది. ఇప్పుడీ కార్యక్రమాన్ని చైనాలోని మొత్తం రాష్ట్రాలలో, ప్రాంతాలలో ప్రారంభించడానికి పథకం రూపొందించబడింది.

*(రాష్ట్రీయ సహారా దినపత్రిక, కొత్త ఢిల్లీ, 18-8-2006, పి.టి.ఐ.)*

## ఇతర దేశాల పరిస్థితులు కూడా ఇంతకంటే మెరుగ్గా లేవు

మన దేశంలో ప్రభుత్వం పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్క తీస్తుంది. దాని ప్రకారం 2001లో మన దేశ జనాభా 102 కోట్ల 70 లక్షల 15

వేలు దాటింది. ఈ జనాభాలో పురుషుల సంఖ్య 53,12,77,000, కాగా స్త్రీల సంఖ్య 49,57,38,000 అని గణాంక వివరాలు తెలియజేయబడ్డాయి. దీన్నిబట్టి ప్రతి 100 మంది పురుషులకు 93 మంది స్త్రీలు ఉన్నారన్న మాట. 1991 జనాభా లెక్కల్లో ఈ వ్యత్యాసం ఇంకా ఎక్కువగా ఉండేది.

*(రాష్ట్రీయ సహారా, 17-9-2006)*

రాష్ట్రాల వారీగా చూస్తే అనేక రాష్ట్రాలలో బాలురు, బాలికల నిష్పత్తి చాలా ఘోరంగా ఉంది. ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలో ఈ నిష్పత్తిలో అసాధారణ మైన సమతూలనా రాహిత్యం ఉంది. ఈ రాష్ట్రాలలో ప్రతి 1000 మంది బాలురకు 800 నుంచి 900 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. 1991 జనాభా లెక్కల ప్రకారం పంజాబ్‌లో ప్రతి 1000 మంది బాలురకు 875 మంది బాలికలు ఉన్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం బాలికల సంఖ్య 793కు దిగజారింది. అదే విధంగా మహారాష్ట్రలో 1991 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 1000 మంది బాలురకు 948 మంది బాలికలు ఉండేవారు. కాగా 2001 జనాభా లెక్కల ప్రకారం బాలికల సంఖ్య 917కు తగ్గిపోయింది.

*(రాష్ట్రీయ సహారా, కొత్త ఢిల్లీ, 22-8-2006, 17-9-2006 సంచికలు)*

## సమాజంలో బాలికల పట్ల చిన్నచూపు

సమాజంలో బాలికల పట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తూ వారు పుట్టక ముందే మాతృగర్భంలో వారిని మట్టుపెట్టడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి. బాలుర సమక్షంలో బాలికల వల్ల పెద్దగా ప్రయోజనం ఏమీ లేదని జనం భావిస్తున్నారు. తల్లిదండ్రులు బాలికలను తమపై వచ్చిపడిన ఓ ఆపదగా పరిగణిస్తున్నారు. బాలికల పోషణ, సంరక్షణ, మాన పరిరక్షణలు వంటి సమస్యలతో పాటు వారి పెళ్ళిళ్ళు కూడా చాలా ఖర్చుతో కూడిన వ్యవ హారమై పోయింది. ఇవేకాకుండా వారి వల్ల మరెన్నో ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. అందువల్ల బాలికలు అసలు పుట్టక ముందే వారి

వ్యవహారాన్ని అంతమొందించి పీడ వదిలించుకోవడంలోనే తమ క్షేమం ఉందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. బాలికలను గురించిన ఈ పైశాచిక భావన ఈనాటి సంగతి కాదు. పూర్వకాలంలో కూడా బాలికల విషయంలో మానవుల మనస్తత్వం ఇలాగే ఉండేది. హ్మజత్ మర్యం (అలైహి) తల్లి తనకు సంతానం కలిగితే ఆ సంతానాన్ని దేవాలయ సేవ కోసం అంకితం చేస్తానని మొక్కుబడి చేసుకున్నట్లు ఖుర్ఆన్ చెబుతోంది. ఆ కాలంలో పురుషులు మాత్రమే దేవాలయ సేవ కోసం నియమించబడేవారు. అందుచేత హ్మజత్ మర్యం తల్లి (అలైహి) తనకు బాలుడు పుడ్తాడని ఆశించారు. కాని ఆమె తనకు బాలిక పుట్టడంతో ఆందోళన చెందారు. ఆ వృత్తాంతం ఖుర్ఆన్‌లో ఈ విధంగా పేర్కొనబడింది:

> **ఇమ్రాన్ స్త్రీ అల్లాహ్‌ను ఇలా ప్రార్థించినపుడు (అల్లాహ్ విన్నాడు) "ప్రభూ! నా గర్భంలో వున్న శిశువును నేను నీకు సమర్పించుకుంటున్నాను. అది నీ సేవకు అంకితం. నా ఈ కానుకను స్వీకరించు. నీవు అన్నీ వినేవాడవు, అన్నీ తెలిసిన వాడవు." తరువాత ఆమెకు ఆడు శిశువు జన్మించినపుడు, ఆమె ఇలా విన్నవించుకుంది: ప్రభూ! నాకు ఆడు శిశువు కలిగింది - ఆమెకు ఏ శిశువు పుట్టిందో అల్లాహ్‌కు బాగా తెలుసు - బాలుడు బాలికవంటివాడు కాడు.** *(ఖుర్ఆన్-3:35, 36)*

## ఖుర్ఆన్ అవతరణ కాలంలో పరిస్థితి

అరేబియాలో అంతిమ దైవప్రవక్త హ్మజత్ ముహమ్మద్ (సల్లం) ప్రభవించిన కాలంలో బాలికల పట్ల అక్కడ పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. ప్రజలు బాలికలను తమ గుండెల మీద కుంపటిగా భావించేవారు. బాలిక పెరిగి పెద్దదయిన తరువాత ధనార్జన కృషిలో తమకు చేదోడువాదోడుగా ఉంటుందని ఆశ లేదు. అందువల్ల వారు బాలికల పోషణ, సంరక్షణల పట్ల ఆందోళన చెందేవారు. పెళ్ళి విషయంలో తగిన సంబంధం దొరక్కపోతే తమ

జాతి, తెగల స్థాయికి భిన్నంగా ఇతర జాతి, తెగల వారికిచ్చి వారి పెళ్ళిళ్ళు చేయవలసి వస్తుందని భయపడేవారు. అదీగాక దోపిడీ దొంగలు వారిని పట్టుకెళ్ళి కట్టుబానిసలుగా చేసుకునే ప్రమాదం కూడా ఆ రోజుల్లో ఉండేది. ఈ కారణంగానే ఆనాటి అరబ్బులు తమలో ఎవరికైనా బాలిక పుడ్తే అతని ముఖం జావగారి పోతుంది. జనానికి తన ముఖం ఎలా చూపించాలని లోలోన తెగ బాధ పడి పోతాడు. ఈ పిల్లను సజీవంగా ఉంచాలా లేక నేలలో పాతిపెట్టి ఈ పీడను శాశ్వతంగా వదిలించుకోవాలా అని పరిపరి విధాల ఆలోచిస్తూ మధన పడుతుంటాడు. ఖుర్‌ఆన్ ఆనాటి ప్రజల మనోభావాలను సమీక్షిస్తూ ఈ విధంగా పేర్కొన్నది:

> **"వారిలో ఎవడికైనా కూతురు పుట్టిందనే శుభవార్తను అందజేస్తే అతడి ముఖాన్ని నల్లని ఛాయలు ఆవరిస్తాయి. అతడు లోలోన కుమిలిపోతాడు. ఈ దుర్వార్త విన్న తరువాత ఇక లోకులకు ఎలా ముఖం చూపాలి అని అతడు నక్కి నక్కి తిరుగుతూ ఉంటాడు. అవమానాన్ని భరిస్తూ కూతుర్ని ఇంట్లో ఉంచు కోవాలా లేక ఆమెను మట్టిలో పాతిపెట్టాలా? అని ఆలోచిస్తాడు.**
> *(ఖుర్‌ఆన్-16:58, 59)*

ఆనాడు అరబ్బులు దైవదూతలను దేవుని కుమార్తెలుగా నమ్మేవారు. ఖుర్‌ఆన్ దీన్ని అనేక చోట్ల ఖండించింది. ఉదాహరణకు- 16:57, 17:40, 52:39, 53:21,22 సూక్తులు చూడండి. ఖుర్‌ఆన్ మరొక చోట వారిలో పౌరుషం కలిగిస్తూ ఇలా అన్నది:

> **"(ఇదంతా తెలిసి, ఒప్పుకొని కూడా) వారు ఆయన దాసులలో కొందరిని ఆయనలో భాగంగా చేశారు. మానవుడు పరమ కృతఘ్నుడు అనేది యదార్థం. అల్లాహ్ తన సృష్టిలోనుండి తన కొరకు కూతుళ్ళను ఎన్నుకొని, మీ కొరకు కొడుకులను ప్రసాదించాడా? అసలు పరిస్థితి ఏమిటంటే; వారు కరుణామయుడైన**

**దేవునికి అంటగట్టే సంతానమే వారిలోని ఒకడికి కలిగిందనే వార్త అందజేస్తే, అతని ముఖం నల్లబడిపోతుంది, అతడు దుః ఖంలో మునిగిపోతాడు. నగల మధ్య పెంచబడే సంతానం, వాదప్రతివాదాలలో తన అభిప్రాయాన్ని పూర్తిగా వివరించలేని సంతానం అల్లాహ్ భాగానికి వచ్చిందా?** *(ఖుర్అన్-43:15-18)*

ఖుర్ఆన్‌లో వేరొక చోట సృష్టికర్త ఈ విధంగా వారిని ప్రశ్నిస్తున్నాడు:

**""వారిని కొంచెం ఇలా అడుగు; మీ ప్రభువునకు కూతుళ్ళున్నూ వారికి కొడుకులూనా? (వారి మనస్సుకు ఇది నచ్చే విషయ మేనా). మేము నిజంగా దైవదూతలను స్త్రీలుగానే సృష్టిం చామా? వారు కళ్ళతో చూసిన విషయాన్నే పలుకు తున్నారా? బాగా విను, అల్లాహ్ సంతానవంతుడు అనే విష యాన్ని వారే స్వయంగా కల్పించి అంటున్నారు. వాస్తవంగానే వారు అసత్య వాదులు. అల్లాహ్ తన కొరకు కొడుకులకు బదులుగా కూతుళ్ళను కోరుకున్నాడా? ఏమయింది మీకు, ఇటువంటి నిర్ణయం తీసుకుంటున్నారు? మీకు స్పృహలేదా? లేక మీరు చెపుతున్న ఈ మాటలకు మీ వద్ద స్పష్టమైన ప్రమాణం అంటూ ఏదైనా ఉంటే, మీ గ్రంథాన్ని తీసుకురండి, మీరు సత్యవంతులే అయితే."** *(ఖుర్అన్-37:149-157)*

## బాలికల సజీవసమాధి-మూఢాచారం

ఇస్లాంకు పూర్వం అజ్ఞాన కాలంలో బాలికల పీడ వదిలించుకోవడానికి కొన్ని అరబ్బు తెగలలో భయంకరమైన ఓ దురాచారం ఉండేది. వారు తమకు కుమార్తె గనక పుడ్తే వెంటనే ఆ పసిపిల్లను నిర్దాక్షిణ్యంగా హతమార్చేవారు. ఈ హత్య కోసం వారు రకరకాల పద్ధతులు అవలంబించేవారు. ఉదాహరణకు-

"స్త్రీ ప్రసవించడానికి ముందే ఒక గుంట తవ్వి సిద్ధంగా ఉంచేవారు. కూతురు పుడితే పుట్టగానే ఆ పాపను గుంటలో పడేసి పూడ్చిపెట్టేవారు."
(ఇబ్నెఅబ్బాస్)

"కూతురు పుట్టగానే ఆమెను చంపి కుక్కలముందు పడవేసే వారు లేదా ఏదైనా కొండ మీదికి తీసికెళ్ళి పారేసేవారు లేదా నీటిలో ముంచి చంపేసేవారు." (ఖతాదా) మరి కొందరు అరబ్బులు బాలిక పుట్టిన తర్వాత కొన్నేళ్ళు ఆమెను సజీవంగా ఉంచుతారు. ఇలా ఆ పిల్ల కాస్త పెరిగి పెద్దదయిన తరు వాత ఒక శుభ ముహూర్తాన ఆమెను బాగా అలంకరించి ఎడారి ప్రదేశంలోకి తీసికెళ్తారు. అక్కడ ఒక చోట ఓ లోతయిన గుంట త్రవ్వేవారు. ఆ పాపను ఆ గుంటలోకి త్రోసి మట్టిపోసి సజీవంగా సమాధి చేసేవారు. *(తఫ్సీరె కబీర్, ఫఖ్రుద్దీన్ రాజి, అల్ మక్తబత్తౌఫీఖా మిసర్, 70/31,46/20)*

ఈ దురాచారాన్ని అరబ్బు తెగలన్నీ పాటించేవి కావు. ముజర్, ఖుజాఅ, తమీమ్ వంటి కొన్ని తెగలు మాత్రమే ఈ ఆచారాన్ని పాటించేవి. మరొక వైపు ఆ కాలంలో కొందరు సంఘసంస్కర్తలు ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఓ పెద్ద ఉద్యమాన్ని లేవ దీశారు. వారు ఎక్కడైనా ఇలాంటి దురాచారం జరుగుతోందని తెలియగానే తక్షణమే అక్కడకు చేరుకొని ఆ పాపను తమ సంరక్షణలోకి తీసుకునేవారు. కొన్ని సందర్భాలలో బాలిక తండ్రికి కొంత సొమ్ము ముట్టజెప్పి మరీ ఆమెను తమ సంరక్షణలోకి తీసుకునే వారు. అలాంటి సంఘసంస్కర్తల్లో సాసా బిన్ నాజియా, జైద్ బిన్ అమ్ర్ బిన్ నఫీల్ పేర్లు చరిత్రలోకి ఎక్కాయి.
(తఫ్సీర్ ఖర్తబి, 116/9, సహీహ్బుఖారి ఉల్లేఖనం-3828)

## ఆధునిక అజ్ఞానం

బాలికలను హతమార్చే ఈ దురాచారం అజ్ఞాన కాలంలో మాత్రమే లేదు. ఈనాటి ఆధునిక కాలంలో కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా

వర్ధిల్లుతోంది. కాకపోతే ఈనాడు పద్ధతులు మాత్రం మారిపోయాయి. అభివృద్ధి చెందని సమాజాలలో మాత్రం ఇప్పటికీ ఇంకా పాత పద్ధతులే పాటించబడుతున్నాయి. ఇక్కడ స్త్రీ ప్రసవించేవరకు ఎదురుచూసేవారు. రాజస్థాన్‌లోని దేవ్డా గ్రామంలో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం అక్కడ గత వందేళ్ళ కాలంలో ఏ బాలిక కూడా పెళ్ళయ్యే వయస్సుకు చేరుకునేదాకా ఎదగలేదు. అంటే అక్కడ అసలు బాలికలు పుట్టనే లేదని అర్థం కాదు. పుట్టగానే ఆ బాలికలను హతమార్చడం జరుగుతుండేది. సామాజిక, కౌటుంబిక వత్తిళ్ళ కారణంగా ఒక్కోసారి ఈ పని కన్న తల్లులే చేసేవారు. కొందరు తల్లులు పాపకు పాలలో నల్లమందు కలిపి తాగించేవారు. కొందరు ముక్కుమీద ఇసుక పొట్లం పెట్టేవారు లేదా నోట్లో, ముక్కులో ఇసుక పోసేవారు. మరి కొందరు తల్లులు పాపకు ఊపిరాడ నీయకుండా ఆమె ముఖం మీద తలగడ దిండు పెట్టి లేదా నోటినిండా ఉప్పు పోసి చంపేసే వారు. (రాష్ట్రీయ సహారా, కొత్తఢిల్లీ, 9-9-2006)

ఇక అభివృద్ధి చెందిన సమాజాల విషయానికి వస్తే ఇక్కడ స్త్రీ ప్రసవించేదాకా వేచి ఉండరు. బాలికలను అసలు జన్మించడానికే అవకాశ మివ్వరు. దానికి ముందే మాతృగర్భాన్ని స్కానింగ్ చేయించి గర్భస్త పిండం ఆడశిశువుకు సంబంధించినదా లేక మగశిశువుకు సంబంధించినదా అని నిర్ధారించుకుంటారు. పిండం ఆడశిశువుకు సంబంధించినదని తెలియగానే గర్భవిచ్ఛేదం చేయిస్తారు. ఈనాడు నెలలు నిండని గర్భస్థ పిండాలు నదులలో బావుల్లో పడి తేలుతున్నట్లు, చెరువు ఒడ్డు మీదనో, లేదా తోపుల్లోనో పడి ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి.

## ప్రస్తుత చట్టాల అసహాయత

భ్రూణహత్యలను అరికట్టడానికి, దానికి వ్యతిరేకమైన వాతా వరణాన్ని సృజించడానికి ఈనాడు కొన్ని ప్రభుత్వేతర సంస్థలు (NGOs) రంగంలోకి దిగి

పని చేస్తున్నాయి. అయితే వాటివల్ల కూడా ఆశించిన ప్రయోజనాలు కానరావడం లేదు. ప్రభుత్వ స్థాయిలో కూడా కొన్ని చట్టాలు చేయబడ్డాయి. మన దేశంలో 1994లో Natal Diagnostic Technic Regulation and Prevention of Misuse Act అనే పేరుతో ఒక చట్టం వచ్చింది. దీనిప్రకారం బిడ్డ జన్మకు పూర్వమే సాంకేతిక పరిజ్ఞానంతో లింగ నిర్ధారణ పరీక్షలు జరవడ చట్టవిరుద్ధమైన చర్యగా పరిగణించబడుతుంది. అదీగాక ఈ చట్టం ప్రకారం సుప్రీంకోర్టు అల్ట్రాసౌండ్ ద్వారా గర్భస్థ పిండాన్ని లింగనిర్ధారణ పరీక్ష జరపడం శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తుంది.

అయినప్పటికీ ఈనాడు దేశవ్యాప్తంగా చట్ట విరుద్ధమైన ఈ లింగ నిర్ధారణ పరీక్షలు జరిపే (Fertiliity Clinics) ఫెర్టిలిటీ క్లినిక్‌లు అత్యధిక సంఖ్యలో పని చేస్తున్నాయి. వాటి ద్వారా కోట్లాది రూపాయల వ్యాపారం సాగు తోంది. ఒక అంచనా ప్రకారం ప్రతి ఏడూ పది నుండి పదిహేను వేల రూపా యల ఫీజు తీసుకొని అయిదు నుండి ఏడు లక్షల ఆడశిశువుల్ని మాతృ గర్భంలో మట్టుపెట్టడం జరుగుతోంది. దీన్ని బట్టి ఈ వ్యాపారం వేయికోట్ల రూపాయలు ఉంటుందని తెలుస్తోంది.

*(రాష్ట్రీయ సహారా, కొత్తఢిల్లీ, 606-2006)*

అప్పుడప్పుడు ఈ క్లినిక్కుల మీద పోలీసులు దాడులు జరిపి చట్టవిరుద్ధమైన ఈ పనులకు పాల్పడిన డాక్టర్లను అరెస్టు చేసి వారిపై కేసులు పెడ్తున్నారు. కోర్టులు శిక్షలు కూడా విధిస్తున్నాయి. ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండి పోతోంది. ఈ సామాజిక రుగ్మతను అంతమొందించడం అలా ఉంచితే, దాని వ్యాప్తిని సైతం అరికట్టడం సాధ్యం కావడం లేదు.

## ఇస్లామీయ నివారణ ప్రయత్నాలు

ఇస్లాం శిశుహత్యను తీవ్రమైన నేరంగా పరిగణిస్తుంది. దాన్ని అరికట్ట డానికి అనేక చర్యలు చేపట్టింది. ఈ దురాచారం పట్ల ప్రజల హృదయాలలో

వ్యతిరేకత జనింపజేస్తుంది. ఏ విషయాలకు భయపడి ప్రజలు ఆడ శిశువుల్ని హతమార్చుతున్నారో ఆ భయాలను దూరం చేస్తుంది. మరోవైపు బాలికల ఉనికి శుభసంక్షేమాలకు సంకేతంగా పరిగణిస్తుంది. వారిని పోషించడం, సంరక్షించడం, విద్యాశిక్షణ గరపడం గురించి ప్రజలను ప్రోత్సహిస్తుంది. ఇలా చేయడం గొప్ప పుణ్యకార్యమని బోధిస్తుంది. ఇస్లాం ఈ చర్యలు చేపట్టి ఈ సామాజిక రుగ్మతను అంతమొందించడంలో ఘనవిజయం సాధించినట్లు దాని చరిత్ర అధ్యయనం చేసిన వారందరికీ తెలుసు.

## మానసిక శిక్షణ

ఇస్లాం మొట్టమొదట ప్రజల మానసిక శిక్షణ వైపు దృష్టి కేంద్రీకరించి పని చేసింది. ఏ చట్టాన్నయినా అమలుపరచాలంటే ప్రజలు ఆ చట్టాన్ని గౌరవించడం వల్ల లాభం ఏమిటో, దాన్ని ఉల్లంఘించడం వల్ల కలిగే నష్టం ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకొని దాన్ని అంగీకరించడానికి మానసికంగా సిద్ధమవ్వాలి. అలా జరగకపోతే చట్టాలు ఎంత కఠినంగా అమలుపరచినా ప్రయోజనం ఉండదు. ఆ కాలంలో అరబ్బులు తమ తమ ఇష్ట దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి ఆయా దేవతా విగ్రహాల ముందు తమ పిల్లలను బలి సమర్పించుకునేవారు. వారిలో కొన్ని తెగలు వివిధ కారణాలతో బాలికలు పుట్టిన తరువాత బాల్యంలోనే వారిని హతమార్చేవి. ఇస్లాం ఇది పైశాచిక చేష్టని, షైతాన్ ఈ చేష్టను మనోహరమైనదిగా చేసి, దానికి మతరంగు పులిమాడని, నిజానికి ఈ చేష్ట ప్రజలకు వినాశకారిగా పరిణమిస్తుందని ఇలా ఉపదేశించింది:

> **"ఇదే విధంగా చాలా మంది ముష్రిక్కులకు తమ సంతాన హత్యను, వారు నిలబెట్టిన భాగస్వాములు సరైనదిగా కనిపించేలా చేశారు, వారిని వినాశానికి గురి చెయ్యడానికి, వారికి వారి ధర్మం సంశయాస్పదమైనదిగా చెయ్యటానికి."**
>
> *(ఖుర్ఆన్-6 : 137)*

ఖుర్ఆన్ ఈ సందర్భంలోనే కొంచెం ముందుకు పోయి, ప్రజలు అజ్ఞానం, అమాయకత్వాలతో చేస్తున్న ఈ పైశాచిక చర్య వారికి నష్టాన్నే కలిగిస్తుందని, వారికి భావిలో ఏసంతానం ప్రయోజనం చేకూర్చుతుందో తెలియకపోయినా బాలికలను హతమార్చడం చాలా తెలివిమాలిన పని అని చెబుతోంది.

> **"అజ్ఞానం వల్ల మూర్ఖత్వం వల్ల తమ సంతానాన్ని హత్య చేసిన వారు, అల్లాహ్ ఇచ్చిన ఉపాధిని, అల్లాహ్‌పై అబద్ధాలు మోపి నిషేధించుకున్న వారు నిశ్చయంగా నష్టానికి గురి అయ్యారు."**
> *(ఖుర్ఆన్-6:140)*

## దారిద్ర్య భయం

అరబ్బుల్లో కొన్ని తెగలు తమ బాలికలను సజీవ సమాధి చేసేవారు. దానికి కారణం, వారు పేదరికం వల్ల ఆడపిల్లల ఉనికిని తమ పాలిట పెద్ద భారంగా భావించే వారు. మగపిల్లలయితే పెరిగి పెద్దవాళ్ళయిన తరువాత తమకు చేదోడు వాదోడుగా ఉంటారని, జీవిత వనరులు సేకరించుకునే పనిలో తమకు సహకరిస్తారని అనుకుంటారు. ఆడ పిల్లలు పెద్దవాళ్ళయిన తరువాత కూడా వారి ఖర్చులన్నీ తల్లిదండ్రులే భరించవలసి వస్తుంది. ఖుర్ఆన్ ఈ భావనలను ఖండిస్తూ ఉపాధి వనరులన్నీ దేవుని చేతిలోనే ఉన్నాయని, ప్రపంచంలోని జీవరాశులన్నిటికీ ఉపాధి ప్రసాదించే బాధ్యత స్వయంగా దేవుడే తీసుకున్నాడని చెబుతోంది. బలవంతుడైనా, బలహీనుడయినా, వికలాంగుడైనా, సంపాదనాపరుడైనా, సంపాదించలేనివాడైనా అందరికీ దేవుని ఆజ్ఞ తోనే ఉపాధి లభిస్తోందని, కాకపోతే దేవుడు ఒక వ్యక్తికి మరొక వ్యక్తి ద్వారా ఉపాధి లభించే ఏర్పాటు చేశాడని, అందువల్ల ఎవరూ ఏ ఒక్కరిని తనకు భారంగా తలచి హతమార్చడం అజ్ఞానం, అమాయకత్వాలతో కూడిన పెద్ద తప్పని పేర్కొంటోంది:

**"పేదరికానికి భయపడి మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము మీకూ ఉపాధినిస్తున్నాము. వారికీ ఇస్తాము."**

*(ఖుర్‌ఆన్-6:151)*

**"పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధినిస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారి హత్య చేయటం ఒక పెద్ద నేరం."**

*(ఖుర్‌ఆన్-17:31)*

## బాలికల సజీవసమాధిపై నిషేధం

ఇస్లాం కేవలం విద్యాశిక్షణలతో తృప్తి చెందలేదు. ఇది ఆడపిల్లల హత్యను దేవుడు, ఆయన ప్రవక్త (సల్లం) నిషేధించిన పాపకార్యాలలో చేర్చింది. హజ్రత్ ముగైరా బిన్ షాబా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపడాన్ని, ఆడపిల్లలను సజీవ సమాధి చేయడాన్ని, దుబారా ఖర్చును దేవుడు నిషేధించాడు."

(సహీ బుఖారి)

హజ్రత్ ముగైరా బిన్ షాబా (రజి) ఉల్లేఖనం ప్రకారమే మరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ పనులన్నిటినీ నిషేధించారని ఉంది.

(సహీ బుఖారి)

## పరలోకంలో యమయాతనలు తప్పవు

ఈ నిషేధాజ్ఞలతో పాటు ఈ పాపకార్యాలకు మరణానంతరం విశ్వప్రభువు న్యాయస్థానంలో సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని, వాటికి శిక్ష అనుభవించవలసి ఉంటుందని కూడా ఖుర్‌ఆన్ హెచ్చరిస్తోంది:

**"సజీవంగా పాతిపెట్టబడిన బాలికను, నీవు ఏ తప్పు వల్ల హత్య చెయ్యబడ్డావని అడిగినప్పుడు......"** *(ఖుర్‌ఆన్-81:8,9)*

బాలికను అన్యాయంగా సజీవ సమాధి చేసి పొట్టన పెట్టుకున్నవారిని ప్రశ్నించడానికి బదులు పై సూక్తిలో నీవు ఏ తప్పు వల్ల చంపబడ్డావని అడగడం జరుగుతుందని ఖుర్ఆన్ తెలియజేస్తోంది. ఈ ప్రకటనా విధానంలో తీవ్రమైన ఆగ్రహం ఉంది. ఇలా సృష్టికర్త తరపున అడగడం జరుగుతుంది. సృష్టికర్త దృష్టిలో కూతుర్ని సజీవ సమాధి చేసిన వ్యక్తి నేరుగా ప్రశ్నించడానికి కూడా అర్హుడు కాడన్నంత దుర్మార్గుడని తెలుస్తోంది.

## శిశుహత్య నివారణకై ప్రవక్త (స) ప్రమాణం చేయించడం

దైవప్రవక్త (సల్లం) కొన్ని విషయాలలో తన అనుచరుల చేత ప్రమాణం చేయించేవారు. వాటిలో సంతానాన్ని చంపమనే విషయం కూడా ఉండేది. హుదైబియా ఒప్పందం తరువాత మక్కా విజయానికి పూర్వం అనేక మంది ముస్లిం మహిళలు మక్కా నుండి మదీనాకు వలస వచ్చారు. ఆ మహిళల చేత ప్రమాణం చేయించమని దేవుడు తన ప్రవక్త (సల్లం)ను ఆదేశించాడు. ఈ విషయమయి దివ్యఖుర్ఆన్ ఈ విధంగా పేర్కొంటున్నది:

> **"ప్రవక్తా! విశ్వసించిన స్త్రీలు బైత్ చేయటానికి నీ వద్దకు వచ్చి, తాము ఎవరినీ సాటిగా నిలబెట్టము అనీ, దొంగతనం చేయము అనీ, వ్యభిచారం చేయము అనీ, తమ సంతానాన్ని హత్య చేయము అనీ, తమ కాళ్ళూ చేతుల మధ్య ఏ అపనిందనూ కల్పించి తీసుకురాము అనీ, ధర్మసమ్మతమయిన మంచి విషయాలలో మీకు అవిధేయత చూపము అనీ ప్రమాణం చేస్తే, వారి నుండి బైత్ తీసుకో; వారిని క్షమించు అని అల్లాహ్‌ను ప్రార్థించు. నిశ్చయంగా అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, కరుణించే వాడూను.** *(ఖుర్ఆన్-60:12)*

మక్కా విజయం తరువాత దైవప్రవక్త (సల్లం) తన తరపున పై సూక్తిలో పేర్కొనబడిన విషయాలను గురించి మహిళల చేత ప్రమాణం

చేయించమని హ్రజత్ ఉమర్ (రజి)ని ఆదేశించారు. ఆ తరువాత ఆయన మదీనా చేరుకొని ఒక ఇంట్లో అన్సార్ మహిళలను సమావేశపరచి వారి చేత ప్రమాణం చేయించమని హ్రజత్ ఉమర్ (రజి)ని ఆదేశించారు.

అదేవిధంగా దైవప్రవక్త (సల్లం) మదీనాకు వలసపోక ముందు మదీనా నుండి హజ్ కోసం వచ్చిన పురుషుల చేత కూడా ప్రమాణం చేయించారు. మక్కా సమీపంలోని ఉఖ్బా ప్రదేశంలో ఆ ముస్లిం పురుషులు దైవప్రవక్త (సల్లం)ను కలుసుకొని ఆయన ముందు ప్రమాణం చేశారు. అలాంటి అదృష్టజాతకులలో హ్రజత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కూడా ఉన్నారు. ఆయన ఇలా తెలుపుతున్నారు:

"దైవప్రవక్త (సల్లం) మమ్మల్ని ఆదేశిస్తూ దేవునికి ఇతరులెవరినీ సాటి కల్పించ మని, దొంగతనం చేయమని, వ్యభిచారానికి పాల్పడమని, సంతానాన్ని చంపము అని ప్రమాణం చేయండని చెప్పారు." *(బుఖారి, ముస్లిం)*

హ్రజత్ ఉబాదా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: "అప్పుడు మేము దైవప్రవక్త (సల్లం) చేతిలో చేయి వేసి ఆయన చెప్పిన విషయాలను గురించి ప్రమాణం చేశాము. అందువల్ల పురుషుల చేత చేయించే ప్రమాణాన్ని కూడా 'బైతున్నిసా' అని పేరివ్వబడింది." *(బుఖారి, ముస్లిం)*

## బాలికల పోషణ, సంరక్షణకు స్వర్గశుభవార్త

ఇస్లాం ఆడపిల్ల ఉనికి తల్లిదండ్రుల గుండెలపై కుంపటి, ఆమె పోషణ పెనుభారం అనే ప్రజల అభిప్రాయాన్ని ఖండించడమే గాకుండా మరొక వైపు ఆడపిల్ల ఉనికి తల్లిదండ్రుల అదృష్టమని, ఆమె పోషణ శిక్షణల బాధ్యత వారి స్వర్గ ప్రవేశానికి రాచబాట అని కూడా పేర్కొన్నది. బాలికలను సరిగా పోషించి, వారి పట్ల మంచిగా మసలుకునే వారికి స్వర్గ శుభవార్తలు తెలియజేసే అనేక హదీసులు కూడా ఉన్నాయి:

హ్రజత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త

(సల్లం) ఇలా అన్నారు: "ఏ మనిషి ఇద్దరు ఆడపిల్లల (సంరక్షణ) బాధ్యత వహిస్తూ వారిని యుక్త వయస్సు వచ్చేవరకు (సరిగా) పోషిస్తాడో, ప్రళయ దినాన అతను, నేను (పరస్పరం) ఈ విధంగా దగ్గరగా ఉంటాం." (దైవప్రవక్త-సల్లం ఈ విషయం చెబుతూ తన రెండు వ్రేళ్ళను కలిపి చూపారు.)

*(సహీ ముస్లిం)*

మరొక ఉల్లేఖనంలో ఇలా ఉంది: "ఏ మనిషి ఇద్దరు ఆడపిల్లల (సంరక్షణ) బాధ్యత తీసుకొని (చక్కగా) పోషిస్తాడో, అతను, నేను ఈ విధంగా స్వర్గంలో ప్రవేశిస్తాము" అన్నారు దైవప్రవక్త (సల్లం). (ఈ విషయం చెబుతూ ఆయన తన రెండు వ్రేళ్ళతో సూచించారు.) *(తిర్మిజి)*

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) మరొక సందర్భంలో ఇలా ప్రవచించారు: "ఎవరికైనా ఇద్దరు ఆడపిల్లలు ఉండి వారు తన దగ్గర ఉన్నంత కాలం అతను వారి పట్ల మంచిగా వ్యవహరిస్తూ ఉంటే ఆమె అతని స్వర్గ ప్రవేశానికి సాధనం అవుతుంది."

*(ఇబ్నెమాజ)*

హజ్రత్ ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "ఎవరికైనా ముగ్గురు కుమార్తెలు ఉండి అతను సహనం వహిస్తూ ఆ ముగ్గురికి తన స్తోమతను బట్టి అన్న పానీయాలు, కట్టు బట్టలు ఇస్తూ సరిగా పోషిస్తాడో ప్రళయదినాన ఆ బాలికలు అతడ్ని నరకాగ్ని నుండి కాపాడే అడ్డుగా మారుతారు." *(ఇబ్నెమాజ)*

మహాప్రవక్త ముహమ్మద్ (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) ఒక సంఘటన గురించి ఈ విధంగా తెలిపారు:

"ఒకరోజు ఓ (పేద)స్త్రీ ఇద్దరు బాలికలను వెంటబెట్టుకొని నాదగ్గరకు యాచించడానికి వచ్చింది. అప్పుడు నాదగ్గర ఒక ఖర్జూరపండు తప్ప మరేమీ లేదు. ఆ ఖర్జూర పండునే నేనామె చేతిలో పెట్టాను. ఆమె దాన్ని తన ఇద్దరు కూతుళ్ళకు చెరి సగం పంచిపెట్టి, తను మాత్రం దాన్ని కాస్తయినా రుచిచూడ

లేదు. ఆ తరువాత ఆమె లేచి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయాక దైవప్రవక్త (స) నాఇంటికి వచ్చారు. నేనాయనకు ఈ సంఘటన గురించి చెప్పాను. అప్పుడాయన ఇలా అన్నారు:

"ఆడపిల్లల (సంరక్షణ బాధ్యత) ద్వారా పరీక్షకు గురిచేయబడిన ఏ మనిషయినా వారి పట్ల మంచిగా ప్రవర్తిస్తే అతని కోసం ఈ బాలికలు నరకానికి అడ్డు (గోడలు)గా తయారవుతారు." (సహీబుఖారి, సహీముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖించిన మరొక హదీసులో ఆమె మూడు ఖర్జూర పండ్లు ఇచ్చినట్లు ఉంది. (బహుశా ఇది రెండవ సారి జరిగిన సంఘటన కావచ్చు.) అప్పుడా యాచకురాలు తన ఇద్దరు కూతుళ్ళకు చెరొక ఖర్జూర పండు ఇచ్చి మూడవ పండును తాను తినడానికి సిద్ధమయింది. అయితే ఆ బాలికలు ఆ పండును కూడా తమకివ్వమని అడిగారు. దాంతో ఆమె ఆ పండును త్రుంచి చెరి సగం పంచిచ్చింది. హజ్రత్ ఆయిషా ఈ విషయం చెబుతూ "ఆ స్త్రీ ప్రవర్తన నాకు బాగా నచ్చింది. కాస్సేపటికి దైవప్రవక్త (సల్లం) నా ఇంటికి వచ్చారు. నేనీ సంఘటన ఆయనకు తెలియజేశాను. ఈ సంగతి విని ఆయన ఇలా ప్రవచించారు:

"దేవుడు ఈ సత్కర్మకు ప్రతిఫలంగా ఆ స్త్రీకి స్వర్గప్రవేశం విధిగా నిర్ణయించాడు (లేదా 'ఆమెను స్వర్గం నుండి విముక్తి కలిగించాడని అన్నారు)" (సహీముస్లిం)

## బాలికల విద్యాశిక్షణల ఔన్నత్యం

హదీసుల్లో బాలికల విద్యాశిక్షణలను గురించి ఎంతో తాకీదు చేయబడింది. అవి గొప్ప పుణ్యకార్యాలుగా పేర్కొనబడ్డాయి. దాని ప్రకారం బాలికల భౌతిక అవసరాలు తీర్చడంతో పాటు వారికి నీతి నడవడికలు, సభ్యతా సంస్కృతులను గురించి కూడా తగిన శిక్షణ గరిపే మనిషి స్వర్గ ప్రవేశానికి అర్హత సంపాదించుకుంటాడు. ఇక్కడ కొన్ని హదీసులు చూడండి:

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ముగ్గురు బాలికలను పెంచి పెద్ద చేసి వారికి పెళ్ళిళ్ళు చేసి వారి పట్ల మంచిగా ప్రవర్తించే మనిషికి స్వర్గం లభిస్తుంది."

*(అబూదావూద్)*

హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "ముగ్గురు కుమార్తెలు లేక ముగ్గురు చెల్లెళ్ళు పెరిగి పెద్దవారయి ఎవరి మీదా ఆధారపడకుండా ఉండే స్థితికి చేరుకునే వరకూ వారిని పోషించి, విద్యాబుద్ధులు నేర్పి, వారి పట్ల ప్రేమ, వాత్సల్య భావంతో ప్రవర్తించిన వ్యక్తికి దేవుడు విధిగా స్వర్గప్రాప్తి కలిగిస్తాడు."

అప్పుడు ఒకతను "దైవప్రవక్తా! మరి ఇద్దరు ఉంటేనో?" అని అడిగాడు. దానికి ఆయన "అప్పుడు కూడా" అన్నారు. జనం అప్పుడు ఒక్క ఆడపిల్లను గురించి అడిగినా దైవప్రవక్త (సల్లం) అదే సమాధానమిచ్చేవారని ఈ హదీసు ఉల్లేఖకుడు హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) అన్నారు.

*(షరహ్‌సున్న, తిర్మిజి, అబూదావూద్)*

ఇస్లాం ఇలాంటి బోధనల ద్వారా సమాజంలో బాలికల స్థాయి, ఔన్నత్యాలను అనూహ్యంగా పెంచింది. వారికి ఇంతకంటే ఎక్కువ స్థాయి, ఔన్నత్యాలు మరే జీవన వ్యవస్థ కూడా ఇవ్వలేదు. బాలికల హక్కులను కాలరాస్తూ, వారిపట్ల వివక్ష చూపుతూ, వారి సహజ స్థాయిని దిగజార్చిన సమాజాలు బాలికల స్థాయిని పెంచి వారి దైన్యస్థితిని దూరం చేయడానికి ఇస్లాం బోధించిన ఈ బోధనలను కరదీపికగా చేసుకోవాలి.

- సమాప్తం -